


విజిలెన్స్ తనిఖీలు

బాపట్ల టౌన్: బాపట్ల పట్టణంలోని పలు దుకాణాల్లో శుక్రవారం రాత్రి విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సీఐ ఆదినారాయణ పాల్గొన్నారు.



సాగర్ నీటి మట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం శుక్రవారం 519.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ముగిసిన విద్యుత్ శాఖ క్రీడా పోటీలు

గుంటూరు వెస్ట్: గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
బాపట్ల	6.24	4.55
నరసరావుపేట	6.26	4.56
గుంటూరు	6.24	4.54

న్యూస్‌రీల్

వినతిపత్రాలు స్వీకరించిన మంత్రి



సంతమాగులూరు (అద్దంకి): సంతమాగులూరు మండలం పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజావేదిక నిర్వహించారు. అధికారులతో సమీక్ష అనంతరం ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతి పత్రాలు తీసుకున్నారు. ఆయా సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. 80 మంది లబ్ధిదారులకు రూ.39 లక్షల చెక్కులను అందించారు. రూ.9 లక్షలకు ఎల్‌ఓసీ పత్రాలు అందజేశారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- పల్నాడు జిల్లాలో 99శాతం హాజరు
- పరీక్ష కేంద్రాలను సందర్శించిన అధికారులు

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. 128 పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 25,346 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 25,111 మంది హాజరయ్యారు. సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దూరవిద్య పదవ తరగతి తెలుగు, ఉర్దూ పరీక్షకు జిల్లాలోని 27 పరీక్ష కేంద్రాల్లో 1,151మందికి గాను 1,013మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన 13 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 75 కేంద్రాలను తనిఖీ చేశాయి. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ గురజాల, రెంటచింతలలోని నాలుగు కేంద్రాలు, జిల్లా పరీక్షల పరిశీలకులు ఎస్.గీత చిలకలూరిపేటలోని 11 పరీక్ష కేంద్రాలను సందర్శించారు. జిల్లా పరిధిలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ చంద్రకళ తెలిపారు.

పరీక్షల డ్యూటీ నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల తొలగింపు

గురజాల : పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం డీఈవో చంద్రకళ తనిఖీ చేశారు. గురజాలలోని నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో రెండు రోజులు కిందట జరిగిన హిందీ పరీక్షలో ఒక ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు బిట్లు అందించారని పలు పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో డీఈవో కేంద్రాన్ని పరిశీలించారు. పల్లెగుంతలోని మోడల్ పాఠశాలలో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. ఆరోపణలు వచ్చిన ఇద్దరు ఉపాధ్యాయులను పరీక్షల డ్యూటీ నుంచి తొలగించినట్లు ఆమె చెప్పారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి

నరసరావుపేట ఈస్ట్: జిల్లా పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులంతా లైఫ్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా అందజేయాలని జిల్లా ఖజానా, లెక్కల అధికారి కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దాదాపు 96 శాతం అందించారని, మిగిలిన వారు కూడా వెంటనే జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా సమర్పించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రం సమర్పించే సమయంలో సమస్యలు తలెత్తినా, వృద్ధాప్యం, అనారోగ్యంతో కదలలేని స్థితిలో ఉన్నవారు సంబంధిత ఖజానా కార్యాలయ సిబ్బంది సహాయంతో మాన్యువల్‌గా సమర్పించవచ్చని ఆయన తెలిపారు. వివరాలకు ఖనాజా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

27న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని తెలిపారు. ఈనెల 27న సెలవు దినంగా పరిగణించినచో మరుసటి రోజున యథావిధిగా నిధి ఆప్ కే నికత్ జరుగుతుందని పేర్కొన్నారు.

జూట్ సాగు.. లాభాలు బాగు

- జిల్లాలో రెండు వేల ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులు
- అద్దంకి, మార్టూరు, యద్దనపూడి మండలాల్లో అధికం
- క్వింటా రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు పలుకుతున్న ధర
- అన్నీ కుదిరితే ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం
- ఈశాన్య రాష్ట్రాలకు విత్తనాలు ఎగుమతి



అద్దంకి ప్రాంతంలో సాగు చేసిన జూట్ పంట



జూట్ కాయలు



విత్తనాలు

అద్దంకి: సంప్రదాయ పంటల సాగుతో లాభాలు రాక విసుగెత్తిన రైతులు పత్తి, పొగాకు పంటలకు ప్రత్యామ్నాయంగా జూట్ పంటను సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడిస్తున్నారు. గోనె సంచులు, బ్యాగులతోపాటు వివిధరకాల వస్తువుల తయారీకి ఉపయోగపడే ఈ జూట్ పంట విస్తీర్ణం జిల్లాలో పెరుగుతోంది. కొన్ని సంవత్సరాల నుంచి బాపట్ల జిల్లాలోని అద్దంకి, యద్దనపూడి, పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు మండలాల్లో 2 వేల ఎకరాల్లో జూట్‌ను సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించే జూట్ పంటను విత్తనాల కోసం సాగు చేస్తారు. ఈ విత్తనాలు ఈశాన్య రాష్ట్రాల్లో నార కోసం పండించే జూట్ పంట సాగుకు ఎగుమతి అవుతుంటాయి. జూట్ పంట జనుము, గోగు జాతికి చెందినది. దీని నుంచి తీసిన నారను ఉపయోగించి గోనె సంచులు, బ్యాగ్‌లు, ఇతర వస్తువులను తయారు చేస్తారు. అయితే దీన్ని మన రాష్ట్రంలో విత్తనాల కోసం పండిస్తారు. పండించిన విత్తనాలు పశ్చిమ బెంగాల్, తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. అక్కడి రైతులు ఈ విత్తనాలను పొలాల్లో సాగు చేసి ఏపుగా పెంచి గోగు, జనప నార తీసిన విధంగా నార తీసి విక్రయిస్తారు.

ఇలా సాగు చేస్తారు...

జూట్ పంటకు ఉమ్మడి ప్రకాశం జిల్లా అనుకూలంగా ఉంటుంది. ఈ నేలలను రైతులు ముందుగా మెత్తగా అయ్యేలా పశువుల ఎరువును కలిపి కలియదున్నుతారు. ప్రస్తుతం జేఆర్‌ఓ-8432, జేఆర్‌ఓ-878 రకం విత్తనాలను సాగు చేస్తున్నారు. ఎకరాకు కిలో విత్తనం సరిపోతుంది. మొక్కలు జానెడు ఎత్తుకు రాగానే, తరువాత రెండు సార్లు అంతర సేద్యం చేస్తారు. మోకాలి ఎత్తులో తల తుంచుతారు. దాంతో పక్క కొమ్మలు వచ్చి మరింత దిగుబడికి దోహదపడుతుంది. విత్తన రోజు నుంచి 90 రోజుల్లో పంట నుంచి విత్తనాలు తీయడానికి సిద్ధం అవుతుంది. ఎకరాకు 5 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ పంటకు విత్తనం ధర చాలా తక్కువ. సేద్యాలు, ఎరువులు, పురుగు మందులు కలుపుకుని ఎకరాకు రూ.5 వేల లోపే అవుతుంది.

ప్రస్తుత ధర ఇలా..

జూట్ పంట విత్తనాలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. ప్రస్తుతం క్వింటా ధర రూ.5 వేలు ఉంది. తొలుత రూ.6 వేలు పలికింది. అన్నీ కుదిరితే ఒక్కో సంవత్సరం క్వింటా విత్తనాలు రూ.15 వేల వరకు పలికిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుత ధర ప్రకారం లెక్కి గట్టినా ఐదు క్వింటాళ్ల లెక్కన ఎకరాకు రూ.25 వేలు రాగా, నికర ఆదాయం 20 వేలు వరకు మిగులుతుందని రైతులు చెప్పున్నారు.

విస్తీర్ణం తక్కువ ఉంటే అధిక ధర

జూట్ పంట క్వింటాలు ధర రూ.5 వేలు నుంచి రూ.15 వేల వరకు పలుకుతోంది. ఒక్కో సంవత్సరం ఒక్కో రేటు ఉంటుంది. ఇక్కడ ప్రత్యేక మార్కెట్ ఏమీ లేదు. కొందరు వ్యాపారులు విత్తనాలను కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు.

– ధన్‌రాజ్, ఏడీఏ

గత సంవత్సరం సాగు చేశా



నేను గత సంవత్సరం జూట్ సాగు చేశాను. వరుస కుదిరితే మంచి లాభాలే వస్తాయి. ధర బాగుండాలి. గతంలో రేటుతో పోలిస్తే ప్రస్తుతం ధర తక్కువగా ఉన్నట్లే . అయినా ఫర్వాలేదు. రైతుకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాన్ని ఇచ్చే పంటగా జూట్ చెప్పుకోవచ్చు. ప్రస్తుతం క్వింటా రూ.5 వేలు ఉంది.

– చెరుకూరి సుబ్బారావు, రైతు

29న జెడ్పీ సర్వసభ్య సమావేశం

బడ్జెట్ ఆమోదమే ఏకైక అజెండా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 29న జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. జెడ్పీ 2024-25 సవరణ బడ్జెట్‌తో పాటు 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆమోదింపచేసుకోవడమే ఏకైక అజెండాగా సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మండల ప్రజా పరిషత్‌లకు ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉంది. కాగా ఈనెల 15న ఏర్పాటు చేసిన జెడ్పీ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిన విషయం విధితమే. జెడ్పీటీసీ సభ్యులకు తెలియకుండా అభివృద్ధి పనులకు ముందస్తు అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా నిధులు కేటాయింపుపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు సమావేశానికి గైర్హాజరైన నేపథ్యంలో మరోసారి సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్న సర్వసభ్య సమావేశంలో అజెండా ఆమోదం కోసం కసరత్తు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యుల వ్యూహాత్మక నిర్ణయం కారణంగా బడ్జెట్ ఆమోదం కీలకంగా మారనుంది. జెడ్పీటీసీ సభ్యులైన తమకు తెలియకుండా, తమ అనుమతి లేకుండా అధికార పార్టీ ఎమ్మెల్యే సిఫార్సులతో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా రూ.కోట్లాది విలువైన పనులకు ఏకపక్షంగా ఆమోదించడాన్ని సహించలేక గత సమావేశానికి గైర్హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు చెబుతున్న అంశాలకు సాక్ష్యంగా సర్వసభ్య సమావేశంపై బడ్జెట్ అజెండాలో ముందస్తు అనుమతుల పేరుతో రూ.12 కోట్ల విలువైన పనులకు ముందస్తు పరిపాలన అనుమతులు ఇచ్చేశారు.

జెడ్పీ బడ్జెట్ స్వరూపం

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌తోపాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ శాఖల వారీగా 2024-25 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్ రూ.492 కోట్ల 79 లక్షల 43వేల 239ను ఆమోదించాల్సి ఉంది. అదే విధంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాబడులు, ఆదాయాలు కలుపుకుని రూ.643 కోట్ల 80 లక్షల 68వేలుగా అంచనా వేశారు. వ్యయం, ఖర్చుల కింద రూ.640కోట్ల 74లక్షల 13వేలు అంచనా వేశారు. మిగులు బడ్జెట్ రూ.మూడుకోట్ల ఆరు లక్షల 5వేలుగా చూపారు.

- పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్‌ను మినహాయించి ప్రత్యేకంగా జెడ్పీ బడ్జెట్‌ను పరిశీలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌లో రాబడులు, ఆదాయాలు రూ.64,02,07,000 కాగా వ్యయం, ఖర్చులను రూ.62,21,77,000వేలు కాగా, మిగులు బడ్జెట్ రూ.కోటి 80 లక్షల 30వేలుగా చూపారు. అదే విధంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆదాయం, రాబడులు రూ.71,11,57,000లు కాగా వ్యయం, ఖర్చులు 69,10,87,000 పోనూ మిగులు రూ.రెండు కోట్ల 70వేలుగా చూపారు.

గోకులాల నిర్మాణాలు వేగవంతం చేస్తాం

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన మినీ గోకులాల నిర్మాణాలు నిర్దేశించిన సమయంలోనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వర్చువల్‌గా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మొత్తం 390 మినీ గోకులాలు మంజూరయ్యాయన్నారు. వీటిలో 284 నిర్మాణాలు పూర్తి చేసామన్నారు. మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ నెల చివరి నాటికి మొత్తం పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ జ్యోతిబసు, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డ్వామా పీడీ శంకర్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్చరీ చాంపియన్ షిప్ ప్రారంభం



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఏఎన్‌యూ(గుంటూరు): ఏపీ ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో నిర్వహిస్తున్న లెనిన్ ఓల్గా మెమోరియల్ అండర్-13, అండర్-10 ఆర్చరీ చాంపియన్‌షిప్ శుక్రవారం యూనివర్సిటీలో ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభకు ఏఎన్‌యూ వీసీ కె.గంగాధరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ ఆర్చరీ పోటీలకు ఏఎన్‌యూ వేదిక కావడం ఆనందదాయకమన్నారు. భవిష్యత్తులో విలువిద్యకు వర్సిటీ పూర్తి సహకారం అదిస్తుందన్నారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి మాట్లాడుతూ క్రీడారంగ అభివృద్ధికి యూనివర్సిటీలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం మాట్లాడుతూ ఆర్చరీ క్రీడను రానున్న రోజుల్లో ఏఎన్‌యూలో ప్రత్యేకంగా ప్రోత్సహిస్తామన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, నేషనల్ జడ్జి బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి అండర్-13 విభాగంలో 700 మంది ఆర్చర్ (బాలురు, బాలికలు) పాల్గొంటున్నారు. తొలిరోజు రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ర్యాంకింగ్ పోటీలు జరిగాయి.



పోటీలు ప్రారంభిస్తున్న వీసీ గంగాధరరావు

నీటి కుంటలు వెంటనే నిర్మించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: పంట నీటి కుంటలు యుద్ధప్రాతిపదికన నిర్మించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పల్లె పండుగ, పంట నీటి కుంటల నిర్మాణంపై ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అమరావతి నుంచి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించిన అనంతరం జిల్లా అధికారులతో జె.వెంకట మురళి సమీక్షించారు. నిరుపేదలకు మాత్రమే ఉపాధి హామీ పథకం ద్వారా పారదర్శకంగా పనులు కల్పించాలన్నారు. పండ్ల తోటల సాగు విస్తీర్ణం ఏడాదిలో లక్ష ఎకరాలకు పెరగాలని సూచించారు. పల్లె పండుగ కార్యక్రమంలో నిర్దేశించిన మేరకు సీసీ రోడ్లు, గోకులాలు నిర్మించాలని పేర్కొన్నారు. జిల్లాలోని 276 గ్రామ పంచాయతీలలో 4 వేల పంట నీటి కుంటల నిర్మాణానికి లక్ష్య నిర్దేశం చేశారు. శనివారం అన్ని ప్రాంతాలలో నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి నుంచి రైతులను కాపాడటానికి ఈ కుంటలు ఎంతో ఉపయుక్తం అవుతాయన్నారు. ఇప్పటికే అధికారికంగా 1,524 కుంటల పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 878 గోకులాల షెడ్‌లు మంజూరు కాగా, ప్రస్తుతం 551 నిర్మాణంలో ఉన్నట్లు పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమం కింద 881 సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉందని తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల ద్వారా 157.5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. రూ.103.1 కోట్ల నిధులతో నిర్మిస్తున్న రహదారులు లక్ష్యం మేరకు ఏప్రిల్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి చేసిన సీసీ రోడ్లన్నింటినీ ఉగాది పండుగ రోజు ప్రారంభించాలన్నారు. 241 అంగన్వాడీ కేంద్రాల భవనాలకు మరమ్మతులు చేయించాలని పీఆర్ ఇంజినీర్లను ఆదేశించారు. పెయింటింగ్ పనులు చేయించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులలో దొంగ మస్టర్లు వేయడం వంటివి చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కూలీలతో పనులు చేయించరాదన్నారు. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. బోర్ల మరమ్మతులు పంచాయతీ నిధులతో చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 12,500 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారుల గృహాలన్నింటిలో వ్యక్తిగత మరుగుదొడ్లను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులతో నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు ప్రత్యేక చర్యలు



పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు తెలిపారు. వడగాల్పులకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రణాళికపై అధికారులతో శుక్రవారం ఆయన స్థానిక కలెక్టరేట్లో సమీక్ష నిర్వహించారు. మార్చి నుంచి జూన్ వరకు జిల్లాలో ఎండ తీవ్రత, వడగాల్పులు ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందన్నారు ప్రతి మండల కేంద్రంలో 4 చలివేంద్రాల చొప్పున ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా గీతంపై మనో భేటీ

బాపట్ల: బాపట్ల జిల్లా గీతాన్ని పాడాలని జిల్లా కలెక్టర్ జె .వెంకట మురళి చేసిన విజ్ఞప్తి మేరకు ప్రముఖ గాయకుడు మనో సానుకూలంగా స్పందించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను ఆయన చాంబర్లో కలిశారు. చందోలు బంగళాముఖి దేవాలయానికి వెళ్తూ మార్గమధ్యలో ఆయన కలెక్టర్‌తో భేటీ అయ్యారు. కలెక్టర్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. జిల్లా గీతంపై చర్చించుకున్నారు. కలెక్టర్ కోరిక మేరకు బాపట్ల జిల్లా గీతాన్ని ఆలపించడానికి మనో అంగీకరించారు. జిల్లా గీతం కోసం నిర్వహించిన పోటీలకు 10 ఎంట్రీలు వచ్చాయి. వీటిని అప్పటి జిల్లా విద్యాశాఖ అధికారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలించి, భావపురి రచయితల సంఘం కార్యదర్శి నందిరాజు విజయ్ కుమార్ రచించిన గీతాన్ని ఎంపిక చేసింది. జిల్లా విశిష్టతపై ఫోరం ఫర్ బెటర్ బాపట్ల వారు ప్రచురించిన కరపత్రాన్ని కలెక్టర్ ద్వారా మనోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు, కాకుమాను గురుకుల పాఠశాల సంగీత ఉపాధ్యాయులు అచ్యుతుని నాగపూర్ణ రమాదేవి, పుస్తకోద్యమ సమితి కార్యదర్శి జీవీ పాల్గొన్నారు.



కలెక్టర్‌తో గాయకుడు మనో

ఏఎన్‌ఎం ఉద్యోగోన్నతుల్లో మాయాజాలం

- నిబంధనలకు తూట్లు
- భర్త కాంట్రాక్టు ఉద్యోగి అయినా స్పౌజ్ కోటా అమలు
- డీఎంహెచ్‌ఓ కార్యాలయం తీరుపై విమర్శలు

గుంటూరు మెడికల్: ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్‌లో అనేక తప్పిదాలు జరిగాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీఎంహెచ్‌ఓ కార్యాలయ అధికారులు నిబంధనలకు తిలోదకాలిచ్చారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఏఎన్‌ఎం భర్త కాంట్రాక్టు ఉద్యోగి అయినా స్పౌజ్ కోటా వర్తింపజేశారని, వాస్తవానికి కాంట్రాక్టు ఉద్యోగులకు ఈ నిబంధన వర్తించదని చెబుతున్నారు. ప్రలోభాలకు లొంగిపోయిన కొంత మంది ఉద్యోగులు, అధికారుల తీరు వల్లే ఇలా జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తొలి నుంచీ విమర్శలే..

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 266 మంది గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు ఈనెల 17న కౌన్సిలింగ్ నిర్వహించి మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫీమేల్‌గా ప్రమోషన్ ఇచ్చారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు జరిగిన కౌన్సెలింగ్‌లో అనేక తప్పిదాలు దొర్లాయి. సీనియార్టీ జాబితాలో ఖాళీలు సక్రమంగా చూపించలేదని పలువురు యూనియ నేతలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వాటిని సరి చేయకుండానే కౌన్సిలింగ్ నిర్వహించారు. కొన్ని ప్రదేశాల్లో పోస్టులు ఖాళీ లేకపోయినా ప్రమోషన్ ఆర్డర్ ఇవ్వడం ద్వారా అక్కడ వేతనాలు, హెచ్‌ఆర్‌ఏలు తీసుకునే వెసులుబాటు లేక సిబ్బంది తిరిగి కార్యాలయానికి వచ్చి మరో ప్రాంతం కోరుకోవాల్సి వచ్చింది. ప్రమోషన్ ఉత్తర్వులు ఇచ్చేందుకూ కార్యాలయ ఉద్యోగులు ముడుపులు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కొంత మంది ముడుపులు ఇచ్చుకోవాల్సి వచ్చిందని సమాచారం.

ప్రాధాన్యం ఇచ్చే విషయాల్లో తప్పిదాలే...

ప్రభుత్వ సర్వీసులో భార్య, భర్తలు ఇద్దరూ పనిచేస్తుంటే వారికి తొలి ప్రాధాన్యం ఇచ్చి సీనియార్టీ జాబితాలో తొలుత వారిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. అయితే కొందరు కాంట్రాక్టు ఉద్యోగులూ తమ భర్తలు రెగ్యులర్ ఉద్యోగాలు చేస్తున్నారంటూ సర్టిఫికెట్లు పెట్టి కోరుకున్న ప్రాంతాలు దక్కించుకున్నట్లు సమాచారం. ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు వారిని ప్రోత్సహించారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జరిగిన తప్పిదాలను అధికారులు సరిదిద్దాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి.

గజేంద్ర మోక్షం అలంకారంలో నారసింహుడు



మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా స్వామివారు శుక్రవారం గజేంద్ర మోక్షం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యల పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన శేషగిరిరావు, కల్యాణిలు వ్యవహరించగా, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన తాడికొండ తిరుమలరావు, తాడికొండ సాయికుమార్‌లు వ్యవహరించారు. శనివారం స్వామి పార్థసారథి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈవో రామకోటిరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

బాపట్ల టౌన్: సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 24, 25వ తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు చేపట్టబోయే సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ తెలిపారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్యాంకు ఉద్యోగులపై భారం పెరిగిందన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. యూఎఫ్‌బీయూ నాయకత్వంలో పోరాటానికి అందరూ మద్దతు ఇవ్వాలన్నారు. ఈ సమ్మె కేవలం బ్యాంకింగ్ రంగ పరిరక్షణ కోసమే చేస్తున్నారని తెలిపారు. ఎక్కడా జీతభత్యాలు, ఉద్యోగులకు ఆర్థిక డిమాండ్లు లేవన్నారు.

రైల్వేరేక్‌తో ఎంతో ప్రయోజనం



బాపట్లటౌన్: రైల్వేరేక్‌తో బాపట్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని గుంటూరు డివిజన్ రైల్వే కమిటీ మెంబర్ పఠాన్ రాజేష్ తెలిపారు. బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ సహకారంతో బాపట్లలో రైల్వే గూడ్స్ రవాణా కోసం రైల్వేశాఖ అనుమతులు పొందారన్నారు. శుక్రవారం బాపట్ల రైల్వేస్టేషన్‌లోని వసతులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిజాంపట్నం, చీరాల వాడరేవు పోర్ట్ అభివృద్ధి కోసం బాపట్ల, రేపల్లెకు కొత్త రైల్వే లైన్ మంజూరు అయ్యిందన్నారు. రైల్వేకు నష్టం లేకుండా ప్రయాణికులకు ఇబ్బంది కలగని రీతిలో కొన్ని రైళ్ల నిలుపుదల కోసం అనుమతులు కోరామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు నక్క ప్రకాష్, గవిని ప్రసాద్, జ్యోతి ప్రసాద్, నర్రా ఏడుకొండలు, బీమా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి

బాపట్ల: ఆధునిక సమాజంలో చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడంలో పెరిగిందని, వాటిలోని పోషక విలువలే ఇందుకు కారణం అని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూన రాణి అన్నారు. వ్యవసాయ కళాశాల జన్యుశాస్త్రం మరియు వృక్ష ప్రజనన విభాగం ఆధ్వర్యంలో 'సేంద్రియ చిరుధాన్యాల సాగు, సస్యరక్షణ, ఆరోగ్య ప్రయోజనాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల'పై శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. చిరుధాన్యాలపై ప్రచారం ఎక్కువ జరగాలని ఆమె పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ మండల శ్రీనివాసరావు మాట్లాడుతూ చిరుధాన్యాలను తినడం వలన కండరాల శక్తి వృద్ధి పొందుతుందన్నారు. జన్యుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ లాల్ అహ్మద్ మహమ్మద్ మాట్లాడుతూ చిరుధాన్యాలు అమ్మవంటివన్నారు. అందుకే నేడు వాటిని సిరి ధాన్యాలుగా పిలుస్తున్నారని పేర్కొన్నారు. డాక్టర్ జి.వినయ్ కుమార్, డాక్టర్ టి.మధుమతి, డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దంటూ ఆందోళన



ఆర్‌ఐ విజయేంద్రకు వినతిపత్రం అందిస్తున్న మహిళలు



పేటేరు గ్రామ ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

రేపల్లె రూరల్: తమ గ్రామంలో మద్యం దుకాణం వద్దంటూ రేపల్లె మండలం పేటేరు గ్రామ ప్రజలు శుక్రవారం రెండవ రోజు కూడా నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని మహిళలు, చిన్నారులు ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. షాపు ఏర్పాటు ఆలోచనను విరమించుకునేంత వరకు పోరాటం చేస్తామని మహిళలు తెలిపారు. గంటకుపైగా ఆందోళన చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణ సీఐ మల్లికార్జునరావు వచ్చి మహిళలతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఆర్డీవో, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, తహసీల్దార్, డీఎస్పీ కార్యాలయాకు స్థానికులు వెళ్లి వినతిపత్రాలు అందజేశారు.

పాలకులు ఏం సందేశం ఇస్తున్నారు?



పవిత్రమైన గుడి, బడి దారిలో మద్యం దుకాణం ఏర్పాటు చేసి సమాజానికి కూటమి పెద్దలు ఏం సందేశం ఇస్తున్నారో గ్రహించాలి. మా ఇళ్ల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని కోరితే కొందరు కూటమి నేతలు మాత్రం 'రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుంది... మీకు పింఛన్‌లు ఎక్కడి నుంచి ఇవ్వాలంటూ' సమాధానం చెప్పటం విడ్డూరంగా ఉంది. మహిళలు, విద్యార్థినులపై మద్యం మత్తులో దారుణాలు చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారు? అధికారం ఉందని ఇలా దుకాణం ఏర్పాటు చేయాలని చూస్తే ఊరుకోం. ఎంతటి వరకైనా ఉద్యమాన్ని నిర్వహిస్తాం.

–రజని, ప్రైవేటు ఉపాధ్యాయురాలు, పేటేరు

ఇళ్ల మధ్య దుకాణం ఏర్పాటు తగదు



ఇళ్ల సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయటాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. యువత పెడమార్గం పట్టేందుకు నూరు శాతం అవకాశం ఉంది. గుడికి వెళ్లాలన్నా, మందుల షాపుకు వెళ్లి రావాలన్నా ఇబ్బందులు ఎదురవుతాయి. కొన్ని సందర్భాలలో మద్యం తాగి ఇళ్ల ముందుకు చేరి ఇబ్బంది పెడుతున్నారు. ఏకంగా మద్యం షాపును ఇళ్ల మధ్య ఏర్పాటు చేస్తే మహిళలకు భద్రత కరవు అవుతుంది.

–సుజాత, పేటేరు

ఆధునిక వ్యవసాయంతో ఎంతో మేలు



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రవీంద్రబాబు

మార్టూరు: ప్రస్తుత ఆధునిక వ్యవసాయంలో నర్సరీల పాత్ర కీలకమైందని.. షేడ్ నెట్‌లలో తయారైన నారు ఇతర ఉద్యాన మొక్కల పెంపకంతో రైతులకు ఆదాయం, ప్రజలకు ఆరోగ్యం చేకూరుతుందని దర్శి ఉద్యాన శాఖ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవీంద్రబాబు అన్నారు. స్థానిక రాజుపాలెం కూడలిలోని సాయిబాలాజీ కల్యాణ మండపంలో శుక్రవారం బాపట్ల జిల్లా స్థాయి నర్సరీ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధిక ఉత్పత్తులు సాధించాలంటే ఆరోగ్యకరమైన మొక్కలు అవసరమన్నారు. నర్సరీల్లో పెంచిన మొక్కలతోనే అది సాధ్యమన్నారు. గుంటూరు లాం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.రజని మిరప పంటలో వచ్చే తెగుళ్లు, పురుగులు వాటి నివారణ గురించి రైతులకు వివరించారు. బాపట్ల జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి పి.జెన్నెమ్మ నర్సరీల చట్టం 2010 ప్రకారం నర్సరీల రిజిస్ట్రేషన్లు వాటి నిర్వహణ విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏపీఎంఐ పీడీ బీవీ రమణ మాట్లాడుతూ, ఏపీ సీఎన్‌ఎఫ్ జిల్లా డీపీఎం, వాణిశ్రీ, గాండీవ రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ పెంటేల శరత్ , డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి ఎం విజయ రేఖారెడ్డి, మార్టూరు వ్యవసాయ శాఖ ఏడీఏ, కేవీ శ్రీనివాసరావు, మార్టూరు, అద్దంకి, పర్చూరు, చీరాల, కొల్లూరు, ఉద్యానవన శాఖ అధికారులు బి. హనుమంతు నాయక్, దీప్తి, అలేఖ్య, రవి ప్రకాష్ బాబు, కళ్యాణ చక్రవర్తి, మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు ఏవోలు బి. అంజిరెడ్డి, కుమారి, లావణ్య, రాజశేఖర్, వీఏఏలు, ప్రకృతి సేద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

24న వైద్యసేవ సిబ్బంది విధుల బహిష్కరణ

బాపట్ల టౌన్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేసే సిబ్బంది సమస్యలు పరిష్కరించకపోవడంతో ఈ నెల 24వ తేదీన జిల్లాలోని డీసీ ఆఫీసుల వద్ద విధులు బహిష్కరించనున్నట్లు ఆరోగ్యమిత్ర ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బడుగురాజు శుక్రవారం తెలిపారు. ఈ నెల 27వ తేదీన మంగళగిరిలోని వైద్యసేవ ట్రస్ట్ కార్యాలయం వద్ద గాంధేయ పద్ధతుల్లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన తెలియజేస్తామన్నారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు శిక్షణ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: సబ్ జూనియర్ రాష్ట్ర కబడ్డీ జట్టుకు శిక్షణ కార్యక్రమాన్ని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి శుక్రవారం రాత్రి ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి ఎంపికైన 18 మంది క్రీడాకారులతో జట్టు రూపొందింది. మండలంలోని కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ నెల 24వ తేదీ వరకు శిక్షణ కొనసాగనుంది. అనంతరం తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయ స్థాయిలో బిహార్‌లో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు పోటీలు ఉంటాయని జట్టు మేనేజర్ బోగిరెడ్డి స్వామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈపీఆర్‌డీ దాసు, అక్కల రవీంద్రరెడ్డి, స్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వేటపాలెం: స్ట్రయిట్ కట్ కాల్వలో చెక్ వాల్ దగ్గరలో నీటిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడికి సుమారు 58 ఏళ్ల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. ఒంటిపై ఎర్రగీతల బనియన్ ధరించి ఉన్నాడు. మృతుడు దగ్గరలోని చేపలు పట్టుకొనే యానాదుల కాలనీకి చెందిన వాడిగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

1,21,706 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,12,589 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,21,706 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు.. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల ధర రూ.10,500 నుంచి రూ.13,800 వరకు ధర లభించింది.

నాటుసారాతో జీవితం అంధకారం



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న డిప్యూటీ కమిషనర్ హేమంత నాగరాజు తదితరులు

నిజాంపట్నం: నాటుసారా తాగి జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఒంగోలు డిప్యూటీ కమిషనర్ కె.హేమంత నాగరాజు అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిండి పంచాయతీ అదవల గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో శుక్రవారం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నాటుసారాకు ఉపయోగించే ముడి సరకులను విక్రయించినా నేరమేనని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫిర్యాదులు ఉంటే 94904 55599, 94409 02477 నంబర్లకుగానీ, 14405 టోల్‌ఫ్రీ నంబరుకుగానీ సమాచారం అందించాలని సూచించారు. తొలుత నవోదయం 2.0 పోస్టర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రామారావు, నగరం సీఐ ఎం.శ్రీరామ్‌ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఐఎస్‌ఎఫ్ సైకిల్ ర్యాలీ



అధికారులతో సైకిల్ ర్యాలీ బృంద సభ్యులు



చెరుకుపల్లిలో ప్రారంభమైన సీఐఎస్‌ఎఫ్ సైకిల్ ర్యాలీ

చెరుకుపల్లి: దేశ రక్షణలో సీఐఎస్‌ఎఫ్ ఎంతో కీలక పాత్ర పోషిస్తోందని అస్సాం సీఐఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో 15 రోజుల క్రితం ప్రారంభమైన సైకిల్ ర్యాలీ శుక్రవారం చెరుకుపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక పోలీసులు స్వాగతం పలికారు. అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తీర ప్రాంతంలో సైకిల్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రెండు బృందాలుగా ఈ నెల 31వ తేదీ నాటికి గుజరాత్ నుంచి కన్యాకుమారి చేరుకుంటామని ఆయన తెలిపారు. 8 మంది మహిళలు కూడా బృందాలలో ఉన్నారని పేర్కొన్నారు. చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మధ్యాహ్న భోజన విరామం అనంతరం సైకిల్ ర్యాలీ కొనసాగించారు.

వేమవరం వద్ద స్వాగతం

భట్టిప్రోలు: సీఐఎస్‌ఎఫ్ సైకిల్ ర్యాలీ శుక్రవారం మధ్యాహ్నం బాపట్ల వైపు భట్టిప్రోలు మండలం వేమవరం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా బృందసభ్యుల కోసం భట్టిప్రోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అత్యవసరమైన మందులు పంపిణీ చేశారు. భట్టిప్రోలు హైవేపై నుంచి కనగాల, చెరుకుపల్లి, బాపట్ల, చీరాల వరకు ర్యాలీ కొనసాగనుంది.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బాపట్ల టౌన్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ట్రైనీ డీఎస్పీ రావూరి అభిషేక్ తెలిపారు. సీఐఎస్‌ఎఫ్ నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీ శుక్రవారం సాయంత్రం బాపట్ల జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లా సరిహద్దులో బాపట్ల ట్రైనీ డీఎస్పీ రావూరి అభిషేక్ స్వాగతం పలికారు. విశాఖపట్నంలోని హెచ్‌పీసీఎల్ వీఆర్ వైజాగ్ కమాండెంట్ హర్షిత్ దైవానంద్ తదితరులు ప్రసంగించారు.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు



పరేడ్ గ్రౌండ్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల టౌన్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ నిర్వహించే విధుల్లో ప్రిజనర్ ఎస్కార్ట్ కీలకమైనవన్నారు. వాటిని నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించినా, ప్రలోభాలకు లోనైనా ఉపేక్షించబోమన్నారు. ఏమైనా సమస్యలను తమ దృష్టికి తీసుకొని వస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయసారథి, ఎస్‌బి సీఐ నారాయణ, అడ్మిన్ ఆర్‌ఐ మౌలుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల బస్సును ఢీకొట్టిన లారీ

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- తొమ్మిది మందికి స్వల్పగాయాలు




ప్రమాదానికి గురైన పాఠశాల బస్సు



గాయపడిన విద్యార్థులు

అద్దంకి: ఆగి ఉన్న ప్రైవేటు పాఠశాల బస్సును లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో తొమ్మిది మంది విద్యార్థులు స్వల్పగాయాలతో బయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని గోపాలపురంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రావిటీ పాఠశాలకు చెందిన బస్సు బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి వైపు నుంచి విద్యార్థులను ఎక్కించుకుని అద్దంకి మండలంలోని గోపాలపురం గ్రామ సమీపంలోకి వచ్చింది. ఈ క్రమంలో వెనుకగా వచ్చిన లారీ ఆగి ఉన్న బస్సును ఢీకొట్టి ముందుకు వెళ్లింది. బస్సు కుదుపునకు గురవడంతో అందులోని తొమ్మిది మంది విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. 108 వాహనం అక్కడికి చేరుకుని గాయాలైన విద్యార్థులకు ప్రథమ చికిత్స చేశారు.

ముగిసిన ఏఎన్‌యూ ఇంటర్ కాలేజియేట్ బేస్‌బాల్ మెన్ టోర్నీ



విన్నర్ ట్రోఫీని అందుకున్న ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల జట్టుతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడా స్ఫూర్తి జీవితంలో ఉన్నస్థాయికి చేరుస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. రెండు రోజులుగా చౌడవరం గ్రామంలోని కళాశాలలో జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల బేస్ బాల్ (మెన్) టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచి, విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రన్నర్ ట్రోఫీని ఏఎన్‌యూ ఫిజికల్ కళాశాల జట్టు సాధించింది. తృతీయ స్థానంలో ఎమ్ఏఎమ్ పీజి కాలేజీ, నాలుగో స్థానంలో సీఆర్ కాలేజీ జట్లు నిలిచి ట్రోఫీలను అందుకున్నాయి. టోర్నమెంట్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులతో ఏఎన్‌యూ సాఫ్ట్ బాల్ (మెన్) జట్టును సెలెక్షన్ కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్ డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, పీడీలు డాక్టర్ పి. గౌరీశంకర్, డాక్టర్ ఎం.శివరామకృష్ణ, ఏఎన్‌యూ టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ సూర్యనారాయణ, సెలెక్షన్ కమిటీ మెంబర్స్ డాక్టర్ పీ శ్రీనివాస్, డాక్టర్ ఎమ్ బుచ్చిబాబు, డాక్టర్ రాజామెరిసిన్‌బాబు, జె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మాల, మాదిగలను విడగొట్టేందుకే కుట్ర

కూటమి సర్కార్‌పై ఏఎన్‌పీఎస్ అధ్యక్షుడు ఆగ్రహం



ఆందోళన నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

బాపట్ల టౌన్: వర్గీకరణపేరుతో మాలలు, మాదిగలను విడగొట్టేందుకు కూటమి సర్కార్ కుట్ర చేస్తోందని అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చార్వాక తెలిపారు. కూటమి సర్కార్ వర్గీకరణను జనాభా లెక్కలు పూర్తిగా తేల్చిన తర్వాతనే చేయాలంటూ శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. డాక్టర్ చార్వాక మాట్లాడుతూ వర్గీకరణపై కూటమి ప్రభుత్వం పునరాలోచించుకోవాలన్నారు. దళిత ప్రజా సంఘాలు. గత సంవత్సరం ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీ ఎస్టీ వర్గీకరణ చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వానికి అధికారాన్నిస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జై భీమ్‌రావు పార్టీ బాపట్ల నియోజకవర్గ కన్వీనర్ కొచ్చెర్ల వినయ్‌రాజు, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, రాష్ట మాలమహానాడు అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు, గుద్దే రాజారావు, గొర్రుముచ్చు వందనం, డాక్టర్ కాగిత వరప్రసాద్, పర్రె కోటయ్య, కొరగంటి శ్యామ్, జోగి ప్రసంగి, తురిమెళ్ళ అమ్మేశ్వరరావు, పేర్లి కాంతారావు పాల్గొన్నారు.

ఆచార్య కృపాచారికి పరిశోధక గురు పురస్కారం



కృపాచారిని పురస్కారంతో సత్కరించిన ఆచార్య ఇనాక్

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు, దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి పరిశోధక గురువుగా చేసిన సేవలు ప్రశంసనీయమని ప్రముఖ రచయిత, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. స్థానిక చెంచుపేట డొంక రోడ్డులోని ఆచార్య కృపాచారి నివాసానికి శుక్రవారం ఆచార్య ఇనాక్ వచ్చారు. పరిశోధక గురు పేరుతో కొలకలూరి పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. మాట్లాడుతూ తాము ఏటా ప్రదానం చేస్తున్న కొలకలూరి పురస్కారాలను రచయితలతోపాటు పరిశోధకులు, పరిశోధక గురువుకు కూడా అందజేస్తున్నామని గుర్తుచేశారు. ఈ ఏడాది ప్రకటించిన అవార్డుల్లో పరిశోధక గురు అవార్డుకు కృపాచారిని ఎంపిక చేశామని తెలిపారు. అయితే ఆరోగ్య కారణాలతో హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ సభకు కృపాచారి హాజరుకాలేకపోయారని చెప్పారు. అందుచేత తానే స్వయంగా తెనాలి వచ్చి కృపాచారికి ఈ పురస్కారాన్ని అందజేసినట్టు ఆచార్య ఇనాక్ వివరించారు. కృపాచారి పర్యవేక్షణలో 75 మంది పీహెచ్‌డీలు, 68 మంది ఎంఫిల్ చేసినట్టు గుర్తుచేశారు. పలు విశ్వవిద్యాలయాకు 45 పాఠ్యగ్రంథాలను అందించారనీ, పలు అవార్డులను స్వీకరించారని గుర్తుచేశారు. పురస్కారం స్వీకరించటంపై కృపాచారి తన సంతోషాన్ని ప్రకటించారు.